# "సిగరెట్టు"

"నేను సిగరెట్టు కాల్చి తీరుతాను. సిగరెట్టు కాల్చడం అవసరం. నువ్వు వ్యసనం అను ఏమైనా అను వెర్రిబ్రతుకు బ్రతకలేను నేను దర్జాగా చక్రవర్తిలా అనుభవిస్తాను." అన్నాడు అప్పారావు గుర్నాథాన్ని సవాలు చేస్తున్నట్టుగా.

గురునాథం ఒప్పుకోకుండా "నువ్వేమయినా చెప్పు అది వ్యసనం, చెడ్డ అలవాటు" అన్నాడు.

"ఓరి ఎర్రినాగన్నా సిగరెట్లు కాల్చేవాళ్ళంతా వెర్రి నాగప్పలా" అన్నాడు అప్పారావు అక్కడున్న వాళ్ళందర్నీ రెచ్చగొట్టే ధోరణిలో.

"వ్యసనం వ్యసనమే, తెలివైన వాళ్ళు వ్యసనం" జోలికిపోరు. పోయినా కంట్రోలు చేసుకోగల్రు! అన్నాడు గుర్నాథం.

"పోరా ఎర్రి మొగమా నీకు బ్రతుకు తెరువు ఏం తెలుసు" అంటూ అప్పారావు దురుసుగా దులిపేసినట్టు అనేసి గుర్నాథాన్ని లెఖ్ఖచెయ్యకుండా వెళ్ళిపోయాడు.

నిజానికి అప్పారావుకే కాకుండా అక్కడున్న వాళ్ళందరికీ గుర్నాథం వాదన చాదస్తంగాను, గుర్నాథం మొహం ఎర్రిమొహంగాను కనబడింది.

గుర్నాథం చిన్నబుచ్చుకుని అక్కడ్నుంచి ఇవతలికి వచ్చేశాడు.

అప్పారావు కిళ్ళీ దుకాణం వుంది.

గుర్నాథానికి సైకిలు షాపు వుంది.

అప్పారావుకి గుర్నాథంమీద గుర్రు వీడెంత, వీడి బ్రతుకెంత. ఈడి జాతకం నాకు తెలవదూ. ఈడు నిన్న మొన్నదాకా సైకిలు షాపులో కుర్రాడులా పనిచేశాడు కాదూ. ఇప్పుడు పిల్లనిచ్చిన మావ నాలుగు డబ్బులిస్తే అదెట్టి సైకిలు షాపు పెట్టి పెద్ద ప్రయోజకుడులా కబుర్లు చెబుతున్నాడు. ఈడు సైకిలుషాపులో పనిచేసేరోజుల్లో అణాలు బేడాలు యజమాని కన్నుకప్పి కాజేసేవాడు. ఇప్పుడు దిగొచ్చిన అపరదేముడ్లా సెబుతుంటాడు." అన్నాడు అప్పారావు కిళ్ళీ దుకాణందగ్గర శిష్యబృందంతో.

గుర్నాథానికి ఆ మాటలు వినబడుతూనే వున్నాయి.

అప్పారావు తనమీద ఎందుకింత కోపమో యెంత ఆలోచించినా గుర్నాథానికి సబబయిన కారణం ఏదీ కనబడ లేదు. అతనేవీ అతగానివద్ద అప్పు చేసి ఎగ్గొట్టలేదు. అప్పారావు శిష్యబృదంతో చేసే పిచ్చాపాటీలో తనేమీ పిలవని పేరంటంగా కలగ చేసుకుని వాదించ లేదు. అయినా అప్పారావుకి తనమీద ఎందుకో అంతకోపం.

ఒకప్పుడు అప్పారావు తనూ పక్కపక్క వాటాల్లో వుండేవారు. అప్పారావు మొదట్నుంచి అప్పులమీద బ్రతికినవాడే, ఇంట్లో ఆడాళ్ళను నానాతిప్పలు పెట్టేవాడు. గుర్నాథం అణాబేడా ఇచ్చి ఆదుకుంటూండేవాడు.

అసలీ డే సిగరెట్టు గుర్రించి చర్చ జరగటానికి అప్పా

రావుకి తనకీ ఘర్షణ జరగటానికి కారణం గవరమ్మ. గవరమ్మ అప్పారావు తల్లి.

పొద్దున్నే గుర్నాధం కాస్త ఆలస్యంగా కొట్టు తెరచి సైకిళ్ళు బయట పెట్టిస్తున్నాడు కుర్రాడిచేత.

అప్పారావు అప్పటికే కొట్టు తెరిచి సిగరెట్టు తగలేస్తున్నాడు. అతని శిష్యబృందం నిండుగా కొలువుతీరి కూర్చున్నారు.

ఇంతలో గవరమ్మ రంయ్‌రంయ్‌మంటూ వచ్చిపడింది. కొడుకునీ, కొడుకుచుట్టూ చేరిన శిష్యబృందాన్ని దుమ్ము దులిపేసింది. "మీ బాబు సొమ్ము తెచ్చి సుదుపు పెట్టా ర్రా. అరువులుపెట్టి ఎగెయ్యటానికి, ఈళ్ళి ఎర్రనాగన్నని చేసి నంజుకుపోదామని చూస్తున్నారా. పోతారా పోరా అంటూ అదిలించేసరికి ఆకుర్రసజ్జు చల్లగా అక్కడినించి జారుకుని దూరంగా పోయి కూర్చుని చూస్తున్నారు.

గవరమ్మ అప్పారావుని వరస చెరగేసింది. "ఆ గుర్నాథాన్ని చూసి సిగ్గు తెచ్చుకోరాదురా. నీతోటి వాడేగదా. వూరంతా అప్పులు అవీచేసి ఎవ్వాపున్నావు. ఎందుకు దండగ ఓనిర్వాకం లేదు. అందమూ లేదు. యిలాంటి ఎధవల్నందర్ని చేరదీసి పాడయిపోతున్నావు" అంటూ చివాట్లు పెట్టింది గవరమ్మ. పెళ్ళాం నోరెత్తితే కాలెత్తి తాపులు తన్నే అప్పారావు అన్ని చివాట్లు పెట్టినా కిమ్మనలేదు. గవరమ్మకి కాస్త పొలం పుట్రావుంది. ఆ డబ్బు తెచ్చి యిక్కడే ఖర్చు పెడుతూంటుంది. పెళ్ళానికి దడవని అప్పారావు తల్లికి దడవటంలో వున్న ఆంతర్యం యిది.

గవరమ్మ చివాట్లు మాత్రం ఆగలేదు. ఓ సిగరెట్టు కాలిపోయింది.

అప్పారావు యింకో సిగరెట్టు ముట్టించాడు. నీ మాటలు నాకు ఖాతర్ లేదు అని నోటితో చెప్పే దమ్ములేక సిగరెట్టుద్వారా చెబుతున్నట్టుగా.

దూరంగా కూర్చున్న శిష్యబృందం ఈపరాభవాన్నించి కాపాడుకుందుకు సిగరెట్టు కాలుస్తూన్నారు. వాళ్ళకి అప్పారావు సిగరెట్టు పొగలో దేముడిలా కనిపించాడు. గవరమ్మ లాంటి రాకాసులు లేందే దేముడులాంటి అప్పారావులకి విలువ ఉండదు అనుకుంటున్నారు వాళ్ళు.

గవరమ్మ అక్కడ్నించి గుర్నాథం దగ్గర కొచ్చి కొడుకు గొడవంతా వెళ్ళబోసుకుంది. "అప్పారావు బాగా చెడిపోయాడు బాబు. వూరంతా అప్పులు, యింట్లో తిండిగింజలు ఉన్నవో లేవో అజలేదు, తిండికి మాత్రం హాజరు. అస్తమానూ ఆ యెదవ సిగరెట్టు కాలుస్తూ కూచుంటాడు నువ్వయినా చెప్పు" అంటూ చెప్పుకుంది, లబలబలాడుతూ.

గుర్నాథం ఎటూ చెప్పలేక "అప్పారావుకి యిప్పుడు నేను చెప్పతగ్గవాడ్ని కాను గవరమ్మ" అన్నాడు.

గుర్నాథం మాటలు అప్పారావుకి వినబడలేదు. కాని తన గురించి ఏదో చెబుతున్నట్టు పసిగట్టాడు. రాకెట్టులాగ దూసుకుంటూ వచ్చి గుర్నాథంమీద పడ్డాడు.

గవరమ్మ సద్దింతర్వాత వెళ్ళిపోయింది. ఆ ఘర్షణ మారింది. అదే సిగరెట్టు చర్చ.

అప్పారావు రోజుకి ఎలా లేదన్నా మూడు నాలుగు చార్మినార్ పెట్టెలు వూదేస్తాడు.

మనిషి బాగా చిక్కిపోయి ఎముకలు బయటపడి కళ్ళు లోతుకుపోయి అప్పారావు అస్థిపంజరంలా ఉంటాడు. అతనిలో నాజూకు, నాజూవళీకం లేవు.

అప్పారావు చుట్టూ మళ్ళా శిష్యబృందం చేరింది గవర్నమ్మ నిష్క్రమించగానే.

గుర్నాథం కొట్లో కూర్చుని లెఖ్ఖలు రాసుకుంటున్నాడు.

సైకిళ్ళకోసం యింకా ఎవరూ రావటం మొదలెట్టలా. సైకిళ్ళు నిగ నిగ లాడుతూ వరసగా పేర్చబడి వున్నాయి.

"అప్పారావు శిష్యుడితో అన్నాడు.

ఆ ఎర్రిమొగానికి బ్రతుకు తెరువు తెలుసాంట" అంటూ.

"ఆడికేం తెలుసు. దెబ్బ తగుల్తే అప్పుడు తెలుస్తుంది. అడ్డంలేకపోతే అంతా మారాజులే, అన్నాడు శిష్యుడు అడకుండానే. అప్పారావు ఎదురుగ్గా ఉన్న సిగరెట్టు పాకెట్టు తీసి ఓ సిగరెట్టు తీసుకుంటూ.

అప్పారావు కాల్చేది చార్మినార్ అయితే అనువుగా అతని శిష్యబృందం కాల్చేది ఖరీదయిన సిగరెట్లు.

అప్పారావుకి అతని గురువు చెప్పిన థీరి ఏమిటంటె ఏ య్యాపారం అయినా ప్రతి అణాపైసా దగ్గర్నించి రాబట్టాలని

చూడకూడదు. ఒదిలేసేచోట ఒదిలెయ్యాలి. రాబట్టేచోట రాబట్టాలి. ఆ థీరీ ప్రకారమే ఈ శిష్యబృందాన్ని భరిస్తున్నాడు అప్పారావు.

"ఉన్నమాట చెప్పావురా. మణిపూసలాంటి నిజం. అడుపడితే ఈడేంచేత్తాడు. చూడాల్సిందే, ఈడి తెలివి చూడాల్సిందే" అన్నాడు అప్పారావు.

అప్పారావు ఈ మాట అనటమే ఆలస్యం. ఓ శిష్యుడుకి మెరుపులా ఓ ఆలోచన తట్టింది.

గుర్నాథాన్ని సమీపించి "సైకిలు కావాలి" అన్నాడు.

గుర్నాథం యిరుకునపడ్డాడు. కాదనటానికి కారణం ఏం చెబుతాడు సైకిళ్ళన్నీ అలాగ కదలకుండా అక్కడే ఉంటే "సరే పట్టుకెళ్ళు" అన్నాడు.

అరగంట పోయింతర్వాత అతగాడు సైకిలు తెచ్చి యిచ్చాడు.

ఆ వెనకనే యింకోకతను వచ్చి మళ్ళీ పట్టుకు వెళ్ళాడు, అలా రోజంతా ఆ సైకిలు వాళ్ళ చేతులు మారుతూనే తిరిగింది.

డబ్బులెగయ్యకుండా యిచ్చినందుకు గుర్నాథం సంతోషిస్తుంటే "ముందు చక్రం బెండయిందండీ వెనక చక్రంలో పూచలు అరడజనుపైగా యిరిగిపోయాయి" అని చెప్పాడు కుర్రాడు.

గుర్నాథం గుండెలు గతుక్కుమన్నాయి. అప్పారావు కొట్టుదగ్గర బృందం పగలబడి నవ్వుతూంది.

గుర్నాథానికి ఏం చెయ్యాలో పాలుపోలేదు. "ఏం పనయ్యా యిది చేసినవాళ్ళు చెప్పకుండా మోసం చేస్తారా?" అంటూ చీవాట్లు పెట్టాడు.

ఎవరుమటుకు వారు గుర్నాథానికి ప్రమాణాలు చేసి తప్పుకున్నారు.

గుర్నాథం వూరుకున్నాడు. అంతమంది తీసుకెళ్ళి నప్పుడు ఎవర్ని పట్టుకోగలడు?

అప్పారావు సిగరెట్టు ప్యాకెట్టు తెరిచి గుర్నాథం ముందుపెట్టి "విచారించకు గుర్నాథం యాపారం అన్న తర్వాత నష్టాలుంటాయి. కష్టాలుంటాయి అన్నాడు. అక్కడికి గుర్నాథం బాధపడిపోతున్నట్టు తాను ఓదారుస్తున్నట్టు.

అప్పారావు అంచనా ప్రకారం గుర్నాథం ఎర్రి మొహం వెయ్యకుండా ఉండాలంటేనూ, తాను బాధపడటం లేదని చెప్పాలంటేను ఆ సిగరెట్టు తీసుకుని కాల్చాలి.

అయితే గుర్నాథం సిగరెట్టు ముట్టుకోలేదు.

ఎర్రి మొహాలకి యాపారం లాయితీకాదు అన్నారెవరో వెనకనించి.

గుర్నాథం కాస్త కంగారు తిన్నాడు. అప్పారావు తెగించినవాడు. అతనూ అతని శిష్యబృందమూ తెగిన గాలి పటముల్లాంటి వాళ్ళు. ఆళ్ళకి మంచీ చెడూ లేదు. బ్రతుకంటే తారురోడ్డుకాదు తమ్ముడూ గోతుల గతుకుల ముళ్ళదారి, అన్నాడు అప్పారావు సిగరెట్టుపొగ రింగురింగులుగా ఆకాశం లోకి వదుల్తూ.

"దెబ్బలు తగిల్నప్పుడే తెలివి బయటపడుతుంది. ఎఱ్ఱి మొహం వేసుకుని చూస్తూ కూర్చుంటే ఎగతాలి పెడతారు" అన్నాడు అప్పారావు సిగరెట్టు పాకెట్ ముందుకు తోస్తూ.

గుర్నాథం తిరిగి పోయిన ఊచలవైపు, బెండయిపోయిన చక్రం వైపు చూస్తున్నాడు బాధగా.

అప్పారావు మాటలు తూపుల్లా గుచ్చుకుంటున్నాయి.

గుర్నాథం కొట్టుమూసి యింటికి పోతుంటే అప్పారావు కొట్టుముందు కుఱ్ఱాళ్ళు ఎగతాళిగా "ఎఱ్ఱి మొహం, ఎఱ్ఱి మొహం" అంటూ అరిచారు.

అప్పారావు సిగరెట్టు పొగలు వదుల్తున్నాడు.

అప్పారావు పరపతి రెండింతలయింది, గుర్నాథానికి డబ్బురాబడి పెరిగినట్టుగా.

ఆ సెంటరులో కూరగాయల సంఘం వాళ్ళు అప్పారావుని పెద్దగా చేసుకున్నారు. ఆ సెంటరులో రోజూ వియ్యా జట్టీలు జరుగుతుంటాయి. అవి అప్పారావు ముందుకువస్తాయి తీర్పుకి. ఇప్పుడతనికి కాలుకదపటానికి తీరిక లేదు.

పర్యవసానం కొట్లో అరువు కాతాలు పెరిగాయి. ఆలోచించాల్సిన అవసరం పెరిగింది. దర్జాలు వెలగబెట్టాల్సిన అవసరం పెరిగింది. దాంతో కాల్చే సిగరెట్ల సంఖ్య రెట్టింపయింది. ఇప్పుడు అప్పారావు చేతిలో సిగరెట్టు ఆరోవేలు అయిపోయింది.

అప్పారావు ముఖం బాగా పీక్కుపోయింది.

అతగాని శిష్యబృందం గుర్నాథాన్ని వదిలిపెట్టలేదు. అతని సైకిళ్ళు పంచర్లు పడుతూనే ఉన్నాయి. తిగలు ఊడి పోయి చక్రాలు బెండయిపోతూనే ఉన్నాయి. గుర్నాథం చేత ఎర్రిమొహాం వేయిస్తూనే ఉన్నారు.

అప్పారావు సిగరెట్టు ప్యాకెట్టు గుర్నాథం ముందు పెట్టి బ్రతుకు తెరువు గురించి హెచ్చరిస్తూనే ఉన్నాడు.

గవరమ్మ చేటల్లో చెరిగినట్టు, కోర్టు ముందు అప్పారావుని, అతని శిష్యబృందాన్ని దులుపుతున్నపుడు సిగరెట్టు పొగ ఎర్రిమొహం ఎయ్యకుండా అతడ్ని దేముడులా కాపాడుతుంది.

"ఆ సిగరెట్టు లేకపోతే ఈ పాటికి లీడరు అప్పారావు ఎర్రి అప్పారావు అయి కూర్చునేవాడుకాడు" అని అప్పారావు స్వగతం చెప్పుకున్నాడు.

"రోజులాం ఎర్రిమొహాలు ఎయ్యకుండా ఎవరికీ గడవదు అయితే భగవంతుడు మనకి ఎర్రిమొహాలు ఎయ్యకుండా దర్జాగా ఉండటానికి ఉపాయాలు కొన్ని చెప్పాడు. అందులో సిగరెట్టు బ్రహ్మాస్త్రం లాంటిది" అంటాడు అప్పారావు.

అప్పారావుకి సిగరెట్టు అలవాటు రెట్టింపయిం తర్వాత గవరమ్మపోరూ రెట్టింపయింది.

ఓనాడు పెళ్ళాం పిల్లల్ని వెంటబెట్టుకునివచ్చి గుర్నాథం ముందు కడుపు చించుకుంది బావురుమని. అప్పారావు యింట్లో దమ్మిడి ఇవ్వటంలేదంట. పుట గడవడం

కష్టంగా ఉందంట. అప్పారావు అస్తమానం సిగరెట్టు కాలుస్తున్నాడంట. రాత్రిళ్ళు నిద్రలేక దగ్గుతూంటాడంట. డాక్టరు గుండె చెడిపోయింది, సిగరెట్టు మానకపోతే కేన్సరు వస్తుంది అని చెప్పారుట.

గుర్నాథం గుండెలు చెరువయి పోయాయి. "ఇప్పుడు నే చెప్పినా మీ ఆయన వినేట్టులేడు. లాభంలేదు" అన్నాడు.

ఏడుస్తూ వెళ్ళిపోయింది గవరమ్మ.

అప్పారావు మాత్రం దర్జాగా సిగరెట్టు కాలుస్తూ మధ్యమధ్య దగ్గుతూ ఎర్రిమొహం ఎయ్యకుండా శిష్యబృందంతో కబుర్లు చెబుతున్నాడు.

* * *

ఈ సంఘటన జరిగిన రెండు నెలలకి గుర్నాథం తన చుట్టూ చేరిన అప్పారావు శిష్యబృందానికి ఉన్నట్టుండి మాయం అయిపోయిన లీడరు అప్పారావుగురించి ఇలా చెబుతున్నాడు :

"నాకు నిన్ననే తెలిసింది. అప్పారావుకి కేన్సరు జబ్బుట. డాక్టర్లు పూర్తి విశ్రాంతి కావాలన్నారుట. తెలిస్తే అప్పులోళ్ళు పట్టుకుంటారని గవరమ్మ, రంగమ్మ అప్పారావుని స్వగ్రామం తీసుకుపోయారు. ఇక్కడి కొట్లో సామాను రెండోకంటికి తెలియకుండా రాత్రికి రాత్రి ఇంటికి చేర్చింది గవరమ్మ. ఈ రెండు నెలలూ బాగానే ఉన్నాడట. ఉన్నట్టుండి ఓ రోజు వ్యాధి బాగా తిరగబడిపోయి రాత్రి హరీమన్నాడంట. అప్పారావుకి మిగిలిపోయిందల్లా అప్పులు, కాల్చి

పారేసిన సిగరెట్టు పీకల్లాగ పెళ్ళాం,పిల్లలు, తల్లీను”అన్నాడు గుర్నాథం కళ్ళు తుడుచుకొని.

అప్పారావు శిష్యబృందం కొన్ని నిమిషాలపాటు నోరు మెదపలేక పోయింది.

ఎవరో తేరుకుని అడిగారు. “అయితే గురూ, సిగరెట్టు అంతచేటు ప్రాణం తీస్తుందా?” అని.

“ఏదో మితంగా ఒకటి రెండూ కాలిస్తే ఫర్వాలేదు. దరాలు వెలగబెట్టాల్సి వచ్చినప్పుడల్లా, ఆలోచించాల్సి వచ్చినప్పుడల్లా, వెర్రిమొహం ఎయ్యాల్సి వచ్చినప్పుడల్లా సిగరెట్టు కాలిస్తే మాత్రం పళ్ళికిలించాల్సిందే” అన్నాడు గుర్నాథం ఊచలు ఊడిపోయిన బెండుతిరిగిన సైకిలుచక్రం వైపు చూస్తూ.

అప్పారావు సిగరెట్టు దుకాణం, ఆ మసక చీకటిలో అప్పారావు గోరీలాగ కనబడింది; చచ్చిపోయిన అప్పారావు శిష్యబృందం ఎర్రిమొహాలకి.